క్లుప్తంగా

నేడు నగరం మండల సర్వసభ్య సమావేశం

నగరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండల సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీవో చక్రపాణి ప్రసాద్ చెప్పారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య ఆధ్వర్యంలో జరిగే ఈ సమావేశానికి రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు హాజరుకానున్నట్లు తెలిపారు. మండలంలో జరిగే పలు అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష జరుగుతుందని, సంబంధిత శాఖల అధికారులు ప్రగతి నివేదికలతో హాజరుకావాలన్నారు. సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు విధిగా హాజరుకావాలని కోరారు.

జూదరుల అరెస్ట్

కర్లపాలెం: అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే వారిపై చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తామని కర్లపాలెం ఎస్‌ఐ ఎం.శివయ్య హెచ్చరించారు. నల్లమోతువారిపాలెం జీడి తోటలో జరుగుతున్న పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేసి, పేకాట ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.6,700ల నగదు స్వాధీనం చేసుకున్నామని, నిందితులను కోర్టులో హాజరు పరుస్తామని ఎస్‌ఐ తెలిపారు.

కట్లమ్మకు చద్ది నైవేద్యాలు



వెల్లటూరు(భట్టిప్రోలు): శ్రావణమాసం పురస్కరించుకుని వెల్లటూరు గ్రామదేవత కట్లమ్మ తల్లికి నీళ్ల వారబోత కార్యక్రమంలో భాగంగా ఆదివారం చద్ది నైవేద్యాలను భక్తులు సమర్పించారు. ప్రధాన అర్చకులు క్రోవి రామకృష్ణ పూజలు నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలో ముత్యాలమ్మ, కట్లమ్మ, మహాలక్ష్మమ్మను తీర్చిదిద్దారు. సాయంత్రం ప్రత్యేకంగా మాస పూజా కార్యక్రమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని కట్లమ్మ తల్లి దేవస్థాన అభివృద్ధి కమిటీ పర్యవేక్షించింది.

దేశానికి సాంకేతికతను తీసుకొచ్చిన రాజీవ్ గాంధీ



బాపట్ల: దేశానికి సాంకేతికతను తెచ్చిన ఘనత రాజీవ్‌గాంధీకే దక్కిందని బాపట్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గంటా అంజిబాబు పేర్కొన్నారు. రాజీవ్‌గాంధీ 79వ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. ఈ సందర్భంగా అంజిబాబు మాట్లాడుతూ యువతకు రాజీవ్ గాంధీ ఆదర్శమన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా మైనార్టీ అధ్యక్షుడు పటాన్ రాజేష్, పట్టణ అధ్యక్షుడు దోనేపూడి దేవరాజు, మహిళా అధ్యక్షురాలు దండు రేణుక, దోనేపూడి రవి తదితరులు ఉన్నారు.

మృతుడి ఆచూకీ గుర్తింపు

తెనాలిరూరల్: కాలువలో ఉన్న గుర్తు తెలియని మృతదేహం ఆచూకీని పోలీసులు గుర్తించారు. ఈ నెల 16వ తేదీ సాయంత్రం తెనాలి మండలం పెదరావూరు చినపల్లె వద్ద కాలువలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. 17వ తేదీన కేసు నమోదు చేసిన పోలీసులు మృతుడి ఆచూకీని కనుగొన్నారు. మృతుడు పట్టణ ఇస్లాంపేటకు చెందిన డ్రైవర్ షేక్ కరిముల్లా(60)గా గుర్తించారు. మృతికి గల కారణాలను దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్‌ఐ సీహెచ్ వెంకటేశ్వర్లు ఆదివారం రాత్రి తెలిపారు.

ఫిజియోథెరపీ అసోసియేషన్ తొలి కార్యవర్గం ఎన్నిక



అసోసియేషన్ తొలి కార్యవర్గం

తెనాలి: ది తెనాలి ఫిజియోథెరపి అసోసియేషన్ తొలి కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. స్థానిక గౌతమ్ గ్రాండ్ హోటల్ కాన్ఫరెన్స్ హాలులో శనివారం రాత్రి నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో తొలి కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కంభం వెంకటకుమార్, ఉపాధ్యక్షురాలిగా ఆరాధ్యుల కృష్ణవేణి, కార్యదర్శిగా చంద్రశేఖర్, కోశాధికారిగా విజయసాగర్, కార్యవర్గసభ్యులు ఎన్నికయ్యారు. ముఖ్యఅతిథిగా డాక్టర్ కె.అనిల్ కుమార్ హాజరయ్యారు. సభలో డాక్టర్ ఎస్.విజయలక్ష్మి మాట్లాడుతూ ఫిజియోథెరపి అసోసియేషన్ ప్రారంభింటం శుభపరిణామంగా చెప్పారు. ఫిజియోథెరపి సేవలను ప్రజలకు చేరువ చేయాలని సూచించారు. క్వాలిఫైడ్ వైద్యులతోనే ఫిజియోథెరపి సేవలను అందుకోవాలని నూతన అధ్యక్షుడు వెంకటకుమార్ కోరారు. ఫిజియోథెరపిస్టులు సందీప్, డాక్టర్ రవికాంత్, డాక్టర్ శరత్‌బిందు పాల్గొన్నారు.

‘స్థానికం’లో పట్టు నిలుపుకున్న వైఎస్సార్ సీపీ

- పంచాయతీ వార్డు ఉప ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మద్దతుదారులు పైచేయి..
- ఏకగ్రీవం, పోరులో అత్యధిక స్థానాలు కైవసం..
- గతంలో తమ మద్దతుదారులున్న వార్డుల్లోనే టీడీపీ ప్రభావం
- వాటిల్లోనే ఏకగ్రీవం.. అభ్యర్థుల విజయం



దోమా ఆదినారాయణ, రాజుకాల్వ; షేక్ నురుద్దీన్, చినమట్లపూడి; పిట్టు రెడ్డి, తుమ్మలపాలెం; పిట్టు కుమారి, రాంబొట్లపాలెం; బలరామిరెడ్డి, రాంబొట్లపాలెం; బోర్రా ధనలక్ష్మి, వామనగుంటవారిపాలెం; వంకదారు నరేష్, యడ్లపల్లి; పిల్లి సుభాషిణి, వరహాపురం; మున్నంగి శాంతికుమారి, మూల్పూరు; కాగిత చార్లెస్, పేరలిపాడు

రేపల్లె: రేపల్లె నియోజకవర్గంలో ప్రశాంతంగా స్థానిక సంస్థల ఉప ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. నియోజకవర్గంలో 10 గ్రామ పంచాయతీ వార్డులకు ఎన్నికలు నిర్వహించగా 8 వార్డుల్లో అభ్యర్థులు ఏకగ్రీవంగా రెండు వార్డులలో ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి.

రేపల్లె మండలంలో...

రేపల్లె మండలంలో 4 వార్డుల మెంబర్ల స్థానాలకు గాను 3 స్థానాలు ఏకగ్రీవంకాగా ఒక స్థానంలో పోటీ నిర్వహించారు. ఏకగ్రీవమైన 3 వార్డుల్లో 2 స్థానాల్లో టీడీపీ, ఒక స్థానంలో వైఎస్సార్ సీపీ బలపరిచిన అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. చాట్రగడ్డ పంచాయతీలోని 3వ వార్డుకు నారగాని కుమారస్వామి(టీడీపీ), 8వ వార్డుకు పడమటి సూర్యనారాయణ(టీడీపీ) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గతంలో టీడీపీ వార్డు సభ్యులైన నారగాని వెంకట శివలక్ష్మి మృతి చెందటంతో ఆమె భర్త కుమార స్వామి 3వ వార్డుకు, పడమటి కోటేశ్వరరావు మృతి చెందటంతో ఆయన కుమారుడు పడమటి సూర్యనారాయణ 8వ వార్డుకు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాజుకాల్వ పంచాయతీలోని 5వ వార్డుసభ్యుడు పి.తాతయ్య మృతి చెందటంతో వైఎస్సార్ సీపీ బలపరిచిన దోమ ఆదినారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అదేవిధంగా బేతపూడి పంచాయతీలో 7వ వార్డుకు వైఎస్సార్ సీపీ మెంబర్ అమర్తలూరి సాయిసుధకు అంగన్‌వాడీ ఉద్యోగం రావటంతో ఆమె వార్డు మెంబర్‌కు రాజీనామా చేసింది. ఆ వార్డుకు జరిగిన ఎన్నికలో టీడీపీ బలపరిచిన అమర్తలూరి సుజ్ఞానం గెలుపొందింది.

నగరం మండలంలో...

నగరం మండలంలోని మూడు పంచాయతీలలో మూడు వార్డులకు ఉప ఎన్నికలు నిర్వహించారు. దూళిపూడిలోని 6వ వార్డులో ముమ్మలనేని చంద్రశేఖర్ మృతి చెందటంలో ఆయన భార్య ఉషారాణి (టీడీపీ) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బెల్లంవారిపాలెంలోని 6వ వార్డులో పమిడిపాముల యేసయ్య మృతి చెందటంతో ఆయన కుమారుడు విజయబాబు (టీడీపీ) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. చినమట్లపూడిలోని 3వ వార్డులో షేక్ సిరాజుద్దీన్ మృతి చెందటంతో ఆయన కుమారుడు షేక్ నరుద్దీన్ (వైఎస్సార్ సీపీ), షేక్ బాజీ (టీడీపీ) రెండు నామినేషన్ రావడంతో జరిగిన ఎన్నికలలో వైఎస్సార్‌సీపీ బలపర్చిన షేక్ నురుద్దీన్ 62 ఓట్లతో బాజీపై గెలుపొందాడు.

చెరుకుపల్లి మండలంలో...

చెరుకుపల్లి మండలంలో మూడు వార్డులకు అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాంబొట్లపాలెం 1వ వార్డులో పేరుబోయిన వెంకటేశ్వరరెడ్డి మృతి చెందటంతో ఆయన కుమారుడు బలరామిరెడ్డి (వైఎస్సార్ సీపీ), 10వ వార్డులో పిట్టు గోపాల్‌రెడ్డి మృతి చెందటంతో ఆయన భార్య పిట్టు కుమారి (వైఎస్సార్ సీపీ)లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తుమ్మలపాలెం 6వ వార్డులో పిట్టు బల్లారెడ్డి మృతి చెందటంతో ఆయన కుమారుడు పిట్టు రెడ్డి (వైఎస్సార్ సీపీ) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

వేమూరులో పట్టు బిగించారు..

వేమూరు: వేమూరు నియోజక వర్గంలో పంచాయతీ వార్డు మెంబర్లకు ఉప ఎన్నికలు 5 వార్డులో జరిగాయి. వేమూరు మండలంలోని వరహాపురం 10వ వార్డులో వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థి పిల్లి సుభాషిని విజయం సాధించారు. ఆమెకు 72 ఓట్లు వచ్చాయి. టీడీపీ బలపరిచిన అభ్యర్థి వరికూటి కృష్ణకుమారికి 47 ఓట్లు వచ్చాయి. పిల్లి సుభాషిణి 25 ఓట్లు మెజారిటీ సాధించారు. అమర్తలూరు మండలంలోని మూల్పూరు గ్రామంలో 4వ వార్డులో వైఎస్సార్ సీపీ బలపరిచిన అభ్యర్థి మున్నంగి శాంతికుమారి 21 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. మున్నంగి శాంతి కుమారికి 94 ఓట్లు వచ్చాయి. టీడీపీ బలపరిచిన అభ్యర్థి మూల్పూరు ఉషారాణికి 73 ఓట్లు వచ్చాయి. కొల్లూరు మండలంలోని దోనేపూడి గ్రామ పంచాయతీ 5వ వార్డులో టీడీపీ బలపరిచిన అభ్యర్థి కొల్లూరు శ్రీనివాసరావు, చిలుమూరు 4వ వార్డులో యంగ్ర శివయ్య, అమర్తలూరు మండలంలో మూల్పూరు 2వ వార్డు మెంబరు మెరకనపల్లి పద్మ విజయం సాధించారు.

రెండు ఏకగ్రీవం..

అమర్తలూరు(వేమూరు): అమర్తలూరు మండలంలోని వామన గుంటపాలెం 2వ వార్డు మెంబరుగా బోర్రా ధనలక్ష్మి ఏక గ్రీవంగా ఎన్నికయ్యారు. చుండూరు మండలంలోని యడ్లపల్లి గ్రామ పంచాయతీ 8వ వార్డు మెంబరుగా వంకదారు నరేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

వార్డు సభ్యురాలిగా సుబ్బులు

బాపట్ల అర్బన్: బాపట్ల మండలం జిల్లెళ్లమూడి పంచాయతీ పరిధిలోని 6వ వార్డుకు జరిగిన ఉప ఎన్నికల్లో సమీప ప్రత్యర్థి అయిన రోషన్ బి పై 10 ఓట్ల మెజారిటీతో మినుగుల సుబ్బులు గెలుపొందారు. మొత్తం 97 ఓట్లు పోలయ్యాయి. వాటిలో మూడు ఓట్లు చెల్లలేదు. చెల్లుబాటు అయిన 94 ఓట్లలో రోషన్ బి కి 42 ఓట్లు మినుగల సుబ్బులు (గౌన్ గుర్తు)కి 52 ఓట్లు వచ్చాయి. వైఎస్సార్ సీపీ బలపరిచిన అభ్యర్థి సుబ్బులు విజయం సాధించడంతో.. పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహం నెలకొంది.



జిల్లెళ్లమూడి సుబ్బులుకు ధ్రువపత్రం అందజేస్తున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి

పేరలిపాడులో ఏకగ్రీవం..

కర్లపాలెం: మండలంలో రెండు పంచాయతీ వార్డుల స్థానాలు ఖాళీ కాగా.. ఒక స్థానంలో వైఎస్సార్ సీపీ మద్దతుదారు ఏకగ్రీవం అయ్యారు. టీడీపీ మద్దతుదారు సర్పంచ్‌గా ఉన్న పంచాయతీ వార్డులో ఆ పార్టీ బలపరిచిన అభ్యర్థి గెలుపొందారు. పేరలిపాడు పంచాయతీ 10వ వార్డు మెంబర్ పేరలి సురేష్ మృతి చెందడంతో.. ఉప ఎన్నికకు కాగిత చార్లెస్, జోగి సుబ్బారావు నామినేషన్ దాఖలు చేశారు. జోగి సుబ్బారావు నామినేషన్ చెల్లకపోవటంతో కాగిత చార్లెస్ ఏకగ్రీవమైనట్లు ఎన్నికల అధికారి ఎలీషాబాబు ప్రకటించారు. అలాగే బుద్దాం గ్రామ పంచాయతీ 6వ వార్డుకు జరిగిన ఉప ఎన్నికల్లో టీడీపీ మద్దతుదారు నర్రా వెంకటేశ్వర్లు విజయం సాధించారు.

కోనేటిపురంలో రెండు వార్డులు ఏకగ్రీవం



తాతా అంకమ్మ



పడమటి వెంకటేశ్వరరావు

భట్టిప్రోలు: మండలంలోని కోనేటిపురంలో వైఎస్సార్ సీపీ బలపరచిన 1, 5వ వార్డు సభ్యుల ఎన్నిక ఏకగ్రీవం అయ్యింది. ఈ ఎన్నికల్లో తాతా అంకమ్మ, పడమటి వెంకటేశ్వరరావులు ఏకగ్రీవమయ్యారు.

సాగునీటి సమస్యపై ప్రత్యేక దృష్టిసారించాలి

అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించిన ఎంపీ మోపిదేవి



సింగుపాలెంలో రైతులతో మాట్లాడుతున్న ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు

రేపల్లె రూరల్: సాగునీరు సకాలంలో అందటం లేదని, సమస్యను పరిష్కరించాలని సింగుపాలెం గ్రామస్తులు ఇటీవల రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావును కలిసి విన్నవించారు. స్పందించిన ఎంపీ ఆదివారం స్వయంగా సింగుపాలెం గ్రామానికి చేరుకుని రైతులతో మరోమారు మాట్లాడారు. సమస్యను స్వయంగా పరిశీలించారు. వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి సాగునీటి సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. అదే విధంగా నియోజకవర్గంలో ఎక్కడైనా సాగునీరు అందని పరిస్థితి ఉంటే..ఆ ప్రాంతాలను గుర్తించి, చివరి ఆయకట్టు వరకు నీరు అందేలా ప్రత్యేక దృష్టిసారించాలన్నారు.

దేశమాంబకు ప్రత్యేక పూజలు



మంచాల(చేబ్రోలు): మంచాల గ్రామంలోని గ్రామ దేవత దేశమాంబ అమ్మవారికి శ్రావణ మాసం సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. శ్రావణ మాసంలో అమ్మవారికి జరిగే ఉత్సవాల్లో మొదటి ఆదివారం జరిగిన పూజల కోసం అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఆలయ అర్చకులు అమ్మవారికి వివిధ అభిషేకాలు, విశేష కార్యక్రమాలు నిర్వహించారు. దేశమాంబ అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున



మోదుకూరులో మహిళకు కరపత్రం అందజేస్తున్న మంత్రి మేరుగ నాగార్జున

మోదుకూరు(వేమూరు): ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. చుండూరు మండలంలోని మోదుకూరు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు గురించి , గ్రామంలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు కేటాయించడం జరిగిందని మంత్రి ఈ సందర్భంగా తెలిపారు. మోదుకూరు నుంచి అంగలకుదురు వరకు రోడ్డు నిర్మాణానికి నిధులు కేటాయించడం జరిగిందన్నారు. పనులు కూడా ముమ్మరంగా జరుగుతున్నాయని వెల్లడించారు. ప్రజల కనీస అవసరాలు పట్టించుకోకుండా పబ్లిసిటీతో గత ప్రభుత్వం కాలం వెళ్లబుచ్చిందని ఆయన గుర్తుచేశారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా పాలన సాగిస్తున్నారని వివరించారు. అందులో భాగంగానే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టమన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా అభివృద్ధి పనులను ప్రజలు ముందు ఉంచుతూ వారి సమస్యలను అడిగి తెలుసుకుంటున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బి.శాలీ, ఎంపీపీ జాలాది రోబెన్, వైస్ ఎంపీపీ అళ్ల వెంకటరమణారెడ్డి, అన్నపరెడ్డి వీరారెడి, ఎంపీటీసీ కొల్లి బాల సరస్వతీ, సొసైటీ అధ్యక్షుడు గోగిరెడ్డి శేషారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు అన్నపరెడ్డి రఘురామిరెడ్డి, పార్టీ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో వైద్యశిబిరాలు అభినందనీయం



వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న రేపల్లె డీఎస్పీ మురళీకృష్ణ



వైద్య సిబ్బందితో ఏఆర్‌సీ స్కూల్ విద్యార్థులు

నగరం: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు కార్పొరేట్ వైద్యసేవలు అందించే విధంగా వైద్యశిబిరాలు ఏర్పాటుచేయడం అభినందనీయమని రేపల్లె డీఎస్పీ టి.మురళీకృష్ణ అన్నారు. మండలంలోని మంత్రిపాలెంలో ఆదివారం రేపల్లె రెడ్ క్రాస్ సొసైటీ సౌజన్యంతో మణిపాల్ వైద్యశాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించి, మాట్లాడారు. పేద ప్రజల కోసం ఏర్పాటు చేస్తున్న వైద్య శిబిరాలను గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డాక్టర్ వసంతం వీరరాఘవయ్య మాట్లాడుతూ వైద్యశిబిరంలో గుండె జబ్బులు, క్యాన్సర్ నిర్ధారణ, ఎముకలు, కీళ్లు, కంటి బీపీ, షుగర్, ఈసీజీ వంటి పరీక్షలు జరిపినట్లు పేర్కొన్నారు. సుమారు 300 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశామన్నారు. వైద్య శిబిరం నిర్వహణకు కృషి చేసిన గోగినేని రవీంద్ర, కమలికలకు డాక్టర్ వీరరాఘవయ్య అభినందనలు తెలిపారు.

వెల్లటూరులో ఉచిత వైద్య శిబిరం

వెల్లటూరు(భట్టిప్రోలు): వెల్లటూరులోని ఏఆర్‌సీ స్కూల్‌లో హ్యాపీ హాస్పిటల్(తెనాలి), ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో లుక్కా సాంబశివరావు ఆధ్వర్యంలో ప్రముఖ పారిశ్రామిక వేత్త వేములపల్లి రవికిరణ్ మిత్ర బృందం సహకారంతో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు పావని ప్రియాంక, గురునాథ శర్మ, అరుణ్ తేజో, హరిణి, వినీల్ తదితరులు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో భాగంగా మోటూరు ధర్మారావు జ్ఞాపకార్థంగా సీతామహాలక్ష్మి రూ. 25 వేలు వ్యయంతో ప్రయాణికులు, ప్రజలు కూర్చొవడానికి సిమెంటు బల్లలు ఏర్పాటు చేయడం, అలాగే వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయమని అమృతలూరు మాజీ ఎంపీపీ మైనేని రత్న ప్రసాద్ పేర్కొన్నారు. అదే విధంగా గ్రామానికి చెందిన మోర్ల సుబ్బారావు అనారోగ్యంతో ఉండటంతో అతనిని పరామర్శించి, రవికిరణ్ మిత్ర బృందం ఆర్థిక చేయూతనందించారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ నిర్వాహకులు ముమ్మలనేని భానుమతి, రవికిరణ్ మిత్ర బృందం కాట్రగడ్డ గోపాల్, వీరంకి నాగరాజు, రాయన రవితేజ, దారం చిన్నబాబు, అమృతలూరు శ్రీహరి, లుక్కా అశోక్, మండవ రత్న ప్రసాద్ పాల్గొన్నారు.

చారిటీ భరతనాట్య ప్రదర్శన

చేబ్రోలు: మండలంలోని వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో ఆదివారం చారిటీ భరతనాట్యం నృత్య ప్రదర్శన జరిగింది. అమెరికాలోని న్యూజెర్సీలో ఉన్న చాపిన్ స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న శ్రియ గుత్తా నాట్య ప్రదర్శన ఇచ్చింది. దృష్టి లోపం ఉన్న విద్యార్థులకు నిధులను సేకరించాలనే ఉద్దేశంతో ఈ నృత్య ప్రదర్శనను నిర్వహించారు.దీని ద్వారా సేకరించిన నిధులను విజయవాడ గుణదలలోని విజయ మేరీ ఇంటిగ్రేటెడ్ బ్లైండ్ స్కూల్‌కు విరాళంగా అందజేయనున్నారు. చిన్నారి శ్రియ గుత్తా తన 6వ ఏట నుంచే న్యూజెర్సీలోని బాలాదేవి చంద్రశేఖర్ వద్ద భరత నాట్యంలో శిక్షణ పొందుతున్నారు. విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య మాట్లాడుతూ శ్రియ గుత్తా ఇతర విద్యార్థులకు స్ఫూర్తిదాయకమన్నారు. వయసుతో నిమిత్తం లేకుండా సమాజానికి తిరిగి ఇవ్వాలనే సదుద్దేశంతో నృత్య ప్రదర్శనల ద్వారా ఫండ్ సంపాదించడం గొప్ప పరిణామమన్నారు. అనంతరం శ్రియ గుత్తాను, తల్లిదండ్రులు గుత్తా స్రవంతి, శ్రీగోపికాంత్‌లను ఘనంగా సన్మానించారు. వైస్ చాన్సలర్ పి.నాగభూషణ్, యూనివర్సిటీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాకవి గద్దర్ చిరస్మరణీయుడు

సంస్మరణ సభలో వక్తలు



గద్దర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న న్యాయవాదులు

తెనాలి: ప్రముఖ ప్రజాకవి, ప్రజా యుద్ధనౌక గద్దర్ సంస్మరణ సభను ఆదివారం సాయంత్రం స్థానిక అయితానగర్‌లోని పాట్టి శ్రీరాములు కల్యాణ మండపంలో ఘనంగా నిర్వహించారు. గద్దర్ చిత్రపటం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. బుద్దిస్ట్ సంస్థ అధ్యక్షుడు కంచర్ల కోటేశ్వరరావు ఆధ్వర్యంలో సభ నిర్వహించారు. సమావేశంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మండలపు వేణుగోపాలరావు, మాజీ అధ్యక్షుడు దాసరి శ్రీధర్, న్యాయవాదులు కంచర్ల చంద్రశేఖర్, కంచర్ల విజయభాస్కర్, గుమ్మడి రవిరాజు, రాజారాం , భేతాళ ప్రభాకర్, మట్ల మాణిక్యారావు, రవినాయక్, మస్తాన్, కుటుంబరావు, బెన్‌హర్, పీపీఆర్‌వీ సాగర్ పాల్గొన్నారు.

దాడికి పాల్పడింది బంధువులే!

తెనాలిరూరల్: ఆస్తి కోసం దాడికి పాల్పడి బలవంతంగా సంతకాలు, వేలిముద్రలు తీసుకోవాలని చూసిన వారు ప్రకాశం జిల్లా దర్శికి చెందిన వారుగా పోలీసులు భావిస్తున్నారు. పట్టణ గంగానమ్మపేటలోని నీలిశెట్టి వారి వీధికి చెందిన కొక్కెర చినతిరుపాలు ఇంటికి శనివారం తెల్లవారుజామున కొందరు గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి తిరుపాలు, అతడి భార్య వెంకట రమణ, కుమారులపై దాడి చేసి బలవంతంగా ఆస్తి పత్రాలపై సంతకాలు, వేలిముద్రలు తీసుకునే ప్రయత్నం చేయగా, చుట్టుపక్కల వాళ్లు రావడంతో పరారైన సంగతి తెలిసిందే. వీరిలో ఒక యువకుడు స్థానికులకు చిక్కగా అతడిని నంద్యాలకు చెందిన అశోక్‌గా పోలీసులు గుర్తించిన వైనం విదితమే. చినతిరుపాలుకు దర్శిలోని బంధువులకు ఆస్తి వివాదం ఉంది ఈ నేపథ్యంలో అక్కడి బంధువులు, వారికి తెలిసిన వారే దాడికి పాల్పడి ఉంటారని పోలీసులు అంచనాకు వచ్చారు. పోలీసుల అదుపులో ఉన్న అశోక్ కోసం ఇరువర్గాల బంధువులు వచ్చి పోలీసులను సంప్రదించారు. ఇప్పటికే పోలీసులు కేసు నమోదు చేయగా, మిగిలిన నిందితులూ లొంగిపోతామంటూ ఆదివారం రాయబారం పంపినట్లు సమాచారం.

డాక్టర్ సర్ రోనాల్డ్ రాస్‌కు ఘన నివాళి



సర్ రోనాల్డ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మలేరియా అధికారులు, సిబ్బంది

తెనాలిఅర్బన్: ప్రపంచ దోమల దినోత్సవాన్ని స్థానిక కొత్తపేటలోని అసిస్టెంట్ మలేరియా అధికారి కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. మలేరియా వ్యాధిని గుర్తించిన బ్రిటీష్ వైద్యులు డాక్టర్ సర్ రోనాల్డ్ రాస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఇన్‌చార్జి అసిస్టెంట్ మలేరియా అధికారి వంగల పున్నారెడ్డి మాట్లాడుతూ 1857 ఆగస్టు 20న బ్రిటీష్ వైద్యులు డాక్టర్ సర్ రోనాల్డ్ రాస్ దోమకాటు ద్వారా మలేరియా వ్యాధి సోకుతుందని నిర్ధారించారని తెలిపారు. నీటి నిల్వలు దోమలకు అవాసాలని, అవి వృద్ధి చెందకుండా, వాటి బారిన పడకుండా ఉండటమే ప్రపంచ దోమల దినోత్సవ ముఖ్య ఉద్దేశమని చెప్పారు. ఆయన సేవలను గుర్తించి ప్రభుత్వం 1902 నోబుల్ బహుమతి అందించినట్లు చెప్పారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించి దోమలు వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తెనాలి పట్టణ మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్, హెల్త్ ఇన్‌స్పెక్టర్ జి.రవికుమార్ పాల్గొన్నారు.

కోటేశ్వరరావుకు స్వయం కృషి పురస్కారం



కోటేశ్వరరావును సన్మానిస్తున్న రమణరావు, శివశంకర్

తెనాలిఅర్బన్: సంప్రదాయ ఎముకల వైద్యుడు విష్ణుమొలకల కోటేశ్వరరావును మెగాస్టార్ చిరంజీవి స్వయంకృషి పురస్కారాన్ని ప్రదానం చేసి సన్మానించారు. ప్రముఖ సినీ హీరో చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా వంగవీటి రాధా రంగా స్మారక కాపు యువజన సేవా సమితి వ్యవస్థాపకులు తన్నీరు శివశంకర్ ఆధ్వర్యంలో పురస్కారాన్ని ఆదివారం ప్రదానం చేశారు. స్థానిక కొత్తపేటలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ తోటకూర వెంకట రమణరావు, డి.సుబ్రహ్మణ్యేశ్వరరావు, పొన్నం విజయ్ కుమార్, నాగినేని సురేష్ గోపి, పసుపులేటి రమాకాంత్, గోపిశెట్టి కృష్ణకాంత్, అన్నం రవి, కుందె వెంకట గిరి, గోపాలం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జానపద కళలను ప్రోత్సహించాలి



సదస్సులో పాల్గొన్న తెనాలి కళారంగ ప్రముఖులు

తెనాలి: అంతర్జాతీయ జానపద కళా విర్భావ దినోత్సవాన్ని ఆదివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. అభ్యుదయ కళాసమితి, బొల్లిముంత శివరామకృష్ణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ హాలులో నిర్వహించిన సభకు విద్యా కో–ఆర్డినేటర్ సీహెచ్ శ్రీదేవి అధ్యక్షత వహించారు. కన్వీనర్ బొల్లిముంత కృష్ణ మాట్లాడుతూ, జానపద కళారూపాల ఇష్టాగోష్టి సోమ, మంగళవారాల్లోనూ జరుగుతుందని తెలియజేశారు. జానపద కళలు అంతరించి పోకుండా చూడాలని లక్కరాజు లక్ష్మణరావు సూచించారు. కోలాటం, చెక్కభజన గురువు సనకా ప్రసాద్ ఆయా కళల ప్రాముఖ్యతను వివరించారు. సాహిత్యం, జానపద విశ్లేషకుడు డాక్టర్ పాతూరి సుబ్రహ్మణ్యకవి మాట్లాడుతూ జానపద కళలను ప్రజలు, ప్రభుత్వం ప్రోత్సహించాలని అభిప్రాయపడ్డారు. ‘ఉత్తమ ఉపాధ్యాయుడు’ ఎంవీ రఘునాథరావు, హరికథా భాగవతారిణి బెజ్జంకి నాగమణి, వీల్మీకి విజయలక్ష్మి, శారదా చలపతి, జ్యోతి, శివకుమారి, విజయదుర్గ, సర్దెన శ్రీనివాసరావు, యర్రం అప్పారావు మాట్లాడారు.

వివాహిత అదృశ్యం

చినకొండ్రుపాడు (ప్రత్తిపాడు): వివాహిత అదృశ్యమైన ఘటనపై ప్రత్తిపాడు పోలీస్ స్టేషనులో కేసు నమోదయ్యింది. ఎస్‌ఐ డి. రవీంద్రబాబు తెలిపిన ప్రకారం.. కృష్ణా జిల్లా మచిలీపట్నం మండలం మల్లువాయి గ్రామానికి చెందిన పుల్లా మురళికి పదహారు సంవత్సరాల కిందట సూర్యాపేటకు చెందిన సుజాతతో వివాహమయ్యింది. వీరికి పాప, ఒక బాబు సంతానం. రెండేళ్ల కిందట వీరిద్దరూ పిల్లలతో కలిసి కూలిపనుల నిమిత్తం గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం, చినకొండ్రుపాడు గ్రామానికి వలస వచ్చారు. స్థానికంగా ఉన్న వెంకటరాజేష్ కోళ్ళ ఫారంలో పని చేసుకుంటూ, కంపెనీ క్వార్టర్స్‌లోనే నివాసం ఉంటున్నారు. ఈ నెల 5న సుజాత ఎవరితోనో ఫోన్‌లో మాట్లాడుతుండటాన్ని గమనించిన భర్త మురళి ఆమెని మందలించాడు. మర్నాడు ఉదయం సుజాత ఎవరికీ చెప్పకుండా ఎక్కడికో వెళ్లిపోయింది. అదే రోజు నుంచి అదే కోళ్ళ ఫారంలో పని చేస్తున్న ఒరిస్సాకు చెందిన వరుణ్ తండి అనే వ్యక్తి కూడా కనిపించకవడంతో పాటు అతని ఫోన్ కూడా స్విచ్ ఆఫ్ వస్తుంది. దీంతో వరుణే తన భార్య సుజాతని తీసుకొని వెళ్లి ఉండవచ్చని భర్త పుల్లా మురళి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ రవీంద్రబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.